**కథ**

**అతని పేరు లెనిన్. అంటే, సోవియట్ నేత వి.ఐ. లెనిన్ అనుకునేరు. కానేకాదు. ఆ మాటకొస్తే లెనిన్ అసలు పేరు కూడా అదికాదు. మారు పేరు.**




# నేటిసిద్ధార్థుడు

—కె.కె. మీనన్

మన లెనిన్‌ది మాత్రం అసలు పేరే సుమండీ. వాళ్ల అమ్మా నాన్నా కల్సి పెట్టు కున్న పేరు. అయితే అలాంటి పేరెందుకు పెట్టుకున్నారని అడుగుతారేమో! ఆ మహా నేతతో మన లెనిన్‌కు పోలికలుండి ఆ పేరు పెట్టి వుంటారని మీరు అనుకున్నా పొర బాటే.

ఎంచేతనంటే, ఆ లెనిన్‌కూ మన కథలో లెనిన్‌కూ పోలికల్లో ఎక్కడా పొంతన లేదు. ఆ లెనిన్‌కు సొగసుగా ట్రిమ్ చేసిన మేధావుల తాలూకు గడ్డం మీసాలు వుంటాయి. మన లెనిన్‌కు యింకా గడ్డం మీసాల వయస్సే రాలేదు. ఇంకా చెప్పాలంటే ఆ లెనిన్‌కు వెనక్కీ పక్కలకీ వ్యాపించిన దర్పణం లాంటి బట్ట గుండు వుంటుంది. మన లెనిన్‌కు ఇంకా జుట్టు వెనక్కి జరిగిపోయే వయస్సే రాలేదు. ఒకవేళ వచ్చినా అది వెనక్కి జరుగు తుందో లేదో కూడా తెలీదు.

అయితే అతనికా పేరెందుకు పెట్టినట్టు?

అది చెప్తా వినండి.

ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలో చాలా ముఖ్య భూమిక నిర్వహించిన సుబ్రహ్మణ్యం పురఫ్ జి.యస్. అనే మాజీ కామ్రేడ్ అతని భార్య సరోజిని కల్సి సోవియట్ వ్యవస్థపై తమకున్న అభిమానంతో, ఆ వ్యవస్థను నిర్మించిన లెనిన్‌పై ఎనలేని భక్తితో తమ బిడ్డకి ఆ పేరు పెట్టుకున్నారు. అంతేకాదు. ఆ వ్యవస్థ తాలూకు ఆదర్శాలు, అభిమతాలు ఆ కుర్రాడికి ఉగ్గుపాలతో ఉమ్మడిగా రంగ రించి పోసేరు. తమ పుత్రుడు గొప్ప సామ్య వాదిగా రూపొందాలని ఆశించేరు. అదృష్టం కల్సి వస్తే అతని చదువే సామ్యవాద దేశం అయిన సోవియట్ రష్యాలోనే సాగాలని అభి ప్రాయపడ్డారు. కాని అది సాగనే లేదు. సాగకపోగా అతని చదువు మూలంగానేభార్యా భర్తలిద్దరూ విడిపోవల్సి వచ్చింది.

అదెలా అంటే!

సరోజినీ, సుబ్రహ్మణ్యం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వాళ్ల ప్రేమ కూడా సామ్యవాద సిద్ధాంతాలతో ముడిపడి వుంది. ఆ సిద్ధాంతా లనే నమ్ముతూ జీవించాలనివాళ్ళుప్రమాణాలు చేసి మరీ పెళ్లి చేసుకున్నారు. అయితే ఆ పెళ్లయిన కొద్ది కాలంలోనే సుబ్రహ్మణ్యంలో మార్పు పసిగట్టింది సరోజిని. పార్టీ అప్పగిం చిన ప్రతి పనినీ అతను స్వార్థ ప్రయోజనాలకు వాడుకోవటం ప్రారంభించేడు. దాంతో వాళ్ల ప్రేమ బీటలు తీసింది. 'ఆ బీటలు లెనిన్ చదువు సందర్భంగా అగాధాలై విడిపోయారు.

లెనిన్‌ను మంచి ఇంగ్లీషు కాన్వెంటులో వేసి చదివించాలన్నాడు సుబ్రహ్మణ్యం. ఆ కేపిటలిస్టు చదువు ఒద్దన్నది సరోజిని.

"అధిక సంఖ్యాకులైన ప్రజలు అన్నార్తులై వుండగా అంత ఖరీదు చదువులు మన కెందుకు?" అన్నది ఆమె వాదన. ప్రభుత్వం సామాన్యుల కోసం ఏర్పర్చిన పాఠశాలలోనే తన కొడుకు చదూకోవాలని ఆమె కోరింది. ఆమె కోరికను కాలదన్నేడు. అసలు ఆమెనే కాలదన్నేడు. అతను నమ్మిన సామ్యవాద సిద్ధాంతాలన్నీ ఏ గంగలో కల్సిపోయాయో తెలీదు గాని ప్రస్తుతం అతను జెండా రంగు మార్చి మరో రంగు జండా నీడలో మరో తరహా ఆదర్శాలు వల్లిస్తున్నాడు. కమ్యూ నిస్టులు దేశద్రోహులంటూ దేశభక్తి వుపన్యాసా లిస్తున్నాడు. అధికారం చేబట్టి అతి దర్పంగా వెలిగిపోతున్నాడు. పూర్వాశ్రమంలో లేమి గురించి బాగా ఎరిగిన వాడు కాబట్టే దానికి సాధ్యమైనంత దూరంగా వుండి ప్రస్తుతం కలిమితో చేతులు కలుపుతున్నాడు.

ఆ కలిమి బలిమి వల్లనే కాబోలు—మన లెనిన్ చాలా అందంగా ఆరోగ్యంగావున్నాడు. బంగారంతో బొమ్మని చేసి ప్రాణం పోసి నట్టుగా వున్నాడు. అతని ముఖం ఎప్పుడూ పున్నమి నాటి చంద్రుడిలా వుంటుందని అందరూ అంటూ వుంటారు. అతని నెత్తి మీది జుట్టు ఉదయ సూర్య బింబం వెనక కారు మేఘంలానిగనిగలాడుతూవుంటుందని ఇటీవల సుబ్రహ్మణ్యం గార్ని ఆశ్రయించిన ఒక నేప పువ్వు కవి వర్ణించేడు.

అంతే కాదు—

ఆ జుట్టు సముద్రపు కెరటాల్లా మన సమాజంలోనినిమ్నోన్నతాల్లా మెట్లు మెట్లుగా సరదాగా వుంటుందని కూడా కవితాత్మ గల మరో మాజీ కామ్రేడ్ (ప్రస్తుతం మన సుబ్రహ్మణ్య అమాత్యుల వారి ఉపగ్రహం) కవయించేడు.

అతని నవ్వు నవ్వులా వుండదట! ఉదయ సంధ్యలో విచ్చుకుంటోన్న గుమ్మడి పువ్వులా వుంటుందట!! ఇంకా చెప్పాలంటే, కారు చీకట్లో వెలుగుతోన్న రంగుల మతాబాలా కూడా వుంటుందిట!!!

కాని ఇవాళ ఎందుకో అతని ముఖం అలా లేదు. మరోలా వుంది. అంటే చాలా సీరి యస్‌గా వుంది. 'ఇస్క్రా'కి మొదటి సంపాద కీయం రాస్తోన్న లెనిన్ ముఖంలా వుంది. మెన్షివిక్కుల పార్టీని కైవసం చేసుకోబో తున్నప్పటి లెనిన్ ముఖంలా వుంది. ఇంత చిన్న వయస్సులో అంత పెద్ద ఆలోచన్లు ఏవిటో అతన్ని చూసిన వాళ్లెవరికీ అర్థం కాలేదు.

స్కూలుకు తీసికెళ్లేందుకు పుదయమే కారొచ్చింది.

ఊహు..... వెళ్లలేదు.

సాయంత్రం ట్యూషను చెప్పేందుకు టీచరొచ్చేడు. ఆయన అదృష్టం బావున్న టు ట్టంది. బుద్ధిగానే ఒచ్చి కూర్చున్నాడు. కూర్చున్నాడు కదాని లెక్కల పుస్తకం (గణితం) తీసి, ఓ లెక్క చెయ్యమనిచ్చేడు. దాన్ని రెండు మూడుసార్లు ఎగాదిగా చూసి పుస్తకం విసిరి పారేశాడు.

చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది పంతులుకు. కాని కోపాన్ని కడుపులోనే దిగ మింగుకున్నాడు. మంత్రిగారి ముద్దుల కొడు కాయె మరి!

"ఏమైంది బాబూ" అని మాత్రం అడి గేడు.

జవాబు చెప్పలేదు సరిగదా చప్పున లేచి సర్రున తన గదిలోకి జారుకుని తలుపులు బిగించుకున్నాడు లెనిన్. ఏవీ తెలీని అయో మయ వ్యవస్థలో కాస్సేపు అలా ఆ గది వైపు చూస్తో కూర్చొని తర్వాత తనూ వెళ్లిపోయేడు టీచరు.

రాచ కార్యాలుముగించుకుని రాత్రికి ఎప్పుడో వేంచేసేరు మాజీ కామ్రేడ్, ప్రస్తుత అమాత్యులు శ్రీశ్రీ సుబ్రమణ్యం గారు.

ఆనాటి కొడుకు ప్రవర్తన గురించి విని దిగ్భ్రాంతి చెందేడు. వెంటనే లోపలికెళ్లి చూసేడు. ఆదమర్చిహాయిగానిద్దరోతున్నాడు తన ముద్దుల కొడుకు.

ముఖంలో దిగుల్లేదు, విషాదం లేదు. రోగ లక్షణాలు అంతకంటే కన్పించలేదు శ్రీ మాన్ సుబ్రహ్మణ్యం గారికి. ఒక నిట్టూర్పు విడిచి తన ఆఫీసు గదిలోకొచ్చి కూర్చొ న్నాడు.

తల్లిని మరిపించే ప్రేమతో ఎంతో క్రమ శిక్షణతో, శాస్త్రీయంగా పెంచిన తన కొడుకు అలా ఎందుకయిపోయేడో ఎంతఆలోచించినా ఆ రాజకీయపు మేధస్సుకి అందలేదు. ప్రత్య ర్థుల ఆంతరంగికపు ఆలోచన్లని సైతం ఇట్టే పసిగట్టేసి వెంటనే ఎదురు పాచికలు వేయ గల్గిన సమర్థుడు తన కొడుకు మానసిక పరిస్థితిని అంచనా వేయలేని అసమర్థుడుగా వుండిపోయేడు.

ఎదురుగా డ్రైవరు నిలబడి వున్నాడు. అయ్యగారి అనుమతి ఎప్పుడు దొరుకుతుందా ఇంటికి వెళదామని వేచి వున్నాడు. ఇంటికి వెళ్లమనేందుకు బదులు ఇటు రమ్మనిఆదేశం వచ్చింది.

"ఆ ట్యూషన్ మాష్టర్ని వున్న పళంగా పట్టుకురా"

అరగంట వ్యవధిలో టీచరుతో తిరిగి ఒచ్చేడు డ్రైవరు.

"అబ్బాయి వ్యవహారం తెల్సిందా?" అనడిగేడు సుబ్రహ్మణ్యం గారు.

"తెల్సింది బాబూ! అసలేం జరిగిందో నాకు బొత్తిగా అర్థం కావటం లేదు. ఎప్పుడూ వుల్లాసంగా వుండేవాడు, ఇవాళ అదోలా వున్నాడు. విపరీతంగా ప్రవర్తించేడు".

"అంటే?"

"అంటే ఏముంది? ఎప్పట్లానే సమ యానికి ఒచ్చేను. అతనూఎప్పట్లానే బుద్ధిగా ఒచ్చి కూర్చొన్నాడు. లెక్కల పుస్తకం తీసి ఒక లెక్క చెయ్యమని ఇచ్చేను. లెక్క చూడ గానే పుస్తకం విసిరి పారేసి వెళ్లి తన గదిలో పడుకున్నాడు"

"ఆ లెక్క ఏవిటో?"

"పుస్తకం ఇప్పిస్తే చూపిస్తాను"

పుస్తకం వచ్చింది. లెక్క తీసి చదివి విన్పించేడు టీచరు.

—ఒక రైతు వడ్డీ వ్యాపారి వద్ద 12 శాతం వడ్డీకి రూ. 2,400/- రుణం తీసికొన్నాడు. రెండున్నర సంవత్సరాల తర్వాత ఆ రైతు రూ. 1200/- జమ కట్టి మరణించేడు. మిగిలిన తన బాకీకి గాను ఆ వ్యాపారి రైతు ఆవును తీసుకున్నాడు. ఆ ఆవు ధర ఎంత?

"ఇది బాబూ ఆ లెక్క".

"సరే మీరిక వెళ్లండి".

టీచరు వెళ్లగానే తనకు ప్రత్యేకమైన ఆలోచనల్లో పడ్డాడు సుబ్రహ్మణ్యం.

సమస్యకి పరిష్కారం దొరకలేదు. పరి ష్కార మార్గం మాత్రం చిక్కింది. వెంటనే డాక్టర్ శర్మకి ఫోన్జేసేడు. డాక్టర్ శర్మ నగరంలో పేరు మోసిన మానసిక వైద్యుడు.

విషయం విపులంగా చెప్పేడు.

"ఒకసారి అబ్బాయిని చూడాలి" అన్నాడు.

"అయాం సారీ, ఒక ప్రత్యేకమైన వాతా వరణంలో మాత్రమే మానసిక రోగుల్ని పరీక్షించాల్సి వుంటుందని. అంచేత అబ్బాయి ఇక్కడికే రావల్సి వుంటుంది. రేపు వుదయం 9 గం.కే నా క్లినిక్‌కు పంపించండి. వీలుంటే మీరూ రావటం మంచిది" అన్నాడు డాక్టర్ శర్మ.

మర్నాడు లెనిన్‌తో బాటు తనూ వెళ్లేడు సుబ్రహ్మణ్యం.

సుమారు రెండున్నర గంటలసేపు పరీక్ష సాగింది. అంతసేపూ విజిటర్స్ రూంలోనే కూర్చొన్నాడు సుబ్రహ్మణ్యం. ఎంతో మంది రోజూ తన కోసం గంటల తరబడి వేచి వుంటారు. ఇవాళ తను ఒకడాక్టరు విజిటింగ్ రూంలో పడిగాపులు గాచి వుండాల్సి వచ్చింది. ఒక వూరి కరణం మరో వూరికి వెట్టి వాడు కదాఅనుకున్నాడుసుబ్రహ్మణ్యం.

డాక్టరు బైటికొచ్చి—

"మీరు మరోలా అనుకోకుంటే నాదో రిక్వెస్ట్" అన్నాడు.

"చెప్పండి"

"అబ్బాయిని పరీక్షించిన మీదట మిమ్మల్ని కూడా పరీక్షించాల్సిన అవసరం ఏర్పడింది".

మంత్రిగారు ఆలోచన్లో పడ్డాడు. ఒకసారి తన మనసుని సైకియాట్రిస్టు చేతిలో పెడితే ఏం రాకూడని రహస్యాలు బయటికివస్తాయో నని భయపడ్తున్నాడు.

"అంత భయపడాల్సింది ఏమీ లేదు సర్! వెరీ సింపిల్. ఇక్కడే కొన్ని ప్రశ్నలడుగు తాను. అంతే"

అమ్మయ్య అనుకున్నాడు.

"సరే, కానివ్వండి"

"తేంమ్యూ...."

"మీ అబ్బాయికి లెనిన్ అనే పేరెందుకు పెట్టేరు?"

"కావాలనే, అప్పట్లో నాకు కమ్యూనిస్టు పార్టీ అన్నా, సోవియట్ వ్యవస్థ అన్నా చాలా అభిమానంగా వుండేది"

"ఇప్పుడు లేదా?"

"లేదు. ఇప్పుడు నా అభిప్రాయాలు మార్చుకున్నాను. కమ్యూనిస్టు సిద్ధాంతం మీద నాకు విశ్వాసం పోయింది."

"ఎన్నాళ్లుగా?"

"గత రెండు మూడేళ్లుగా. కమ్యూనిస్టు వుద్యమం మీద నాకు విశ్వాసం సడలి పోయాకనే పార్టీ నుంచి బయటికివచ్చేశాను."

"పార్టీ నుంచి బయటికి రాక ముందు మీ అభిప్రాయాలు ఎలా వుండేవి?"

"అంటే?"

"అంటే మరేం లేదు. ఈ వ్యవస్థ మారాలని గాని, ఈ వ్యవస్థ దోపిడీ వ్యవస్థ దీన్ని సమూలంగా మట్టుపెట్టాలని గాని ఇంట్లో అంటూ వుండేవారా?"

"అలా అనుకోవటం సహజమేగా? ఇంటికి ఎవరైనా కామ్రేడ్స్ గాని, సానుభూతి పరులు గాని ఒచ్చినప్పుడు తరచు ఇలాంటి సంభాషణే సాగుతూ వుండేది. చాలా తీవ్రం గానే అప్పట్లో ఈ వ్యవస్థను దుయ్యబట్టే వాణ్ని. నేను మాస్కో వెళ్లినప్పుడు ఒక సంఘటన జరిగింది. అది కూడా తరచు చెప్తూ వుండే వాడిని".

"అదేవిటో నాక్కూడా చెబుతారా?"

"మా డెలిగేషన్ మాస్కోలో ఒక స్కూలు సందర్శించింది. మాలో రష్యా భాష తెల్సిన మిత్రుడున్నాడు. అతనికి ఒక విద్యార్థి తెలివి స్థాయిని పరీక్షించాలని బుద్ధి పుట్టినట్టుంది. ఒక అబ్బాయిని లేపి—ఒక షాపు వాడు వంద పెన్సిళ్లను డెబ్బయి రూపా యిలకు కొని మూట ఇరవై రూపాయిలకు అమ్మేడు. అతనికి లాభం ఎంత?" అని. అప్పుడా కుర్రాడు తడుంకోకుండా—సైబీ రియాకు దూరం ఎంతో అంతే అన్నాడు. ఈ విషయం కూడా విద్యా విధానం ప్రస్తావన వచ్చినప్పుడల్లా చెబ్తూ వుండేవాణ్ని"

"అదీ విషయం....." అన్నాడు డాక్టర్ శర్మ

"ఆ ప్రభావం మీ అబ్బాయి మీద బాగా పడింది."

"అంటే?...."

"ఏముంది? చాలా స్పష్టం. ఈ వ్యవస్థని ఒకప్పుడు చాలా దుష్టంగా చిత్రించేరు. పైగా మీరు సాధించబోయే నూతన వ్యవస్థని ఒక భూతల స్వర్గంగా అరచేత వైకుంఠం చూపిం చేరు. ఆ వ్యవస్థలో విద్యా విధానం ఎలా వుంటుందో ఉదహరిస్తూ ఈ సంఘటన చెప్పేవారు. ఆ బీజాలు పసివాడి మనస్సుపై గాఢంగా హత్తుకుపోయి. ఇప్పుడు మొలకెత్తటం ప్రారంభించేయి..."

"వాటిని మొక్కలోనే తుంచేయాలి డాక్టర్"

"అదేలా సాధ్యం? మీరైతేఅభిప్రాయాలు చాలా త్వరగా మార్చుకోగలరు. కాని పసివాళ్లు అలా కాదే. ఒకసారి ఒక అభిప్రాయంవాళ్లలో ఏర్పడిందంటే మరి మార్చుకోడం సాధ్యం కాదు."

"నిన్న మీ అబ్బాయి స్కూలుకు వెళ్ల లేదు. ఎందుకో తెల్సా?"

"వెళ్లలేదని తెల్సు. కాని, ఎందుకు వెళ్ల లేదో మాత్రం తెలీదు"

"హోం వర్కు చేయనందుకు. హోం వర్కులో వాళ్లిచ్చిన లెక్కలు అతని మనస్సుని గాయపర్చేయి. అతను ఏర్పర్చుకున్న నమ్మ కాలన్నీ వమ్మైపోయినట్టు భావించేడు. ఆ స్కూలునీ, ఆ విద్యా విధానాన్నీ అతనికి తెలీకుండానే అసహ్యించుకుంటున్నాడు. అతనికి సమాజంలో సిద్ధార్థుడిలా సతమత మౌతున్నాడు....."

".....ఒక వ్యవస్థ మారాలంటే ఆ మార్పును చిన్న పిల్లల పాఠ్య పుస్తకాల దగ్గ ర్నుంచీ తీసుకురావాలని ఒకప్పుడు మీరు వాదించేవారు. అది అతని హృదయాన్ని బాగా హత్తుకుంది. ఇప్పుడు మీరు అధి కారంలో వున్నారు. అధికారం లేని ఆనాటి మీ అభిప్రాయాలని ఇప్పుడు ఆచరణలో పెట్టగలరని అతను నమ్మేడు. ఆ నమ్మకానికి అర్థం లేదని అతను హోం వర్కు చేయాల్సిన లెక్క తేల్చి చెప్పింది"

"ఏవిటా లెక్క?"

"—ఒక ధాన్యం వ్యాపారి 600 బస్తాల ధాన్యం కొని 7 శాతం లాభానికి అమ్మేడు. అతనికి బస్త ఒకటికి రూ. 250/- కిట్టు బాటైతే వాటిని తరలించటానికి రూ. 1000/- ఖర్చయింది. అందులో అతని లాభం ఎంత? 600 బస్తాల అమ్మకం రేటెంత?—ఇది పచ్చి దోపిడీగా ఆ పసి హృదయానికి తట్టింది. లెక్కల్లోనే ఇంత దోపిడీ జరుగుతూ వుంటే ఇకనిజజీవితంలో ఎంత జరుగుతోందోనని అతను బాధ పడ్తు న్నాడు. స్కూల్లో ఈ దోపిడీని అభ్యసించి బైటకెళ్లి ప్రతి విద్యార్థి ఆచరణలో పెడతారని అతను నమ్ముతున్నాడు. అలాంటప్పుడు మనం ఆశించే సోషలిస్టు తరహా సమాజం కూడా ఏర్పడదుగా"

"అంతేనా...లెక్క చేయలేకనంటారా?"

"అతని మేధస్సును అంత తక్కువగ అంచనా వేయకండి, అతడు మహా మేధావి. ఎలాంటి లెక్కనైనా చిటికెలో చేసి జవాబు చెప్పగలడు".

"అలాగని మీరెలా చెప్పగలరు?"

"అతను స్కూలు హోం వర్కు గురించి చెబుతూ ఒక పేద రైతు వడ్డీ వ్యాపారి కబంధ హస్తాల్లో ఇరుక్కుని రూ 750/- నష్టపోయేడని ఏడ్చేడు. రైతు చనిపోయినా కూడా దయాదాక్షిణ్యాలు లేకుండా రూ. 1920/- ఖరీదు చేసే అతని ఆవుని కాజేశాడని వాపోయేడు. ఇంతకంటే అతని మేధో సంపత్తికి మరో నిదర్శనం ఏం కావాలి?"

మంత్రిగారు అవాక్కుగా వింటున్నారు.

"ఈ సందర్భంగా నాకోసత్యంతెల్సింది"

"ఏవిటది?"

"మీ కొడుకు మిమ్మల్నిద్వేషిస్తున్నాడు"

"ఆ....."

"అవును. ఈ సమాజం కంటే కూడా ఎక్కువగా అతను మిమ్మల్నేద్వేషిస్తున్నాడు".



814

28/4/91